# బలమా? గుణమా?



పూర్వం కళింగ రాజ్యాన్ని పాలించే ధర్మకేతుకు ఇద్దరు కుమారు లుండేవారు. పెద్దవాడు వీరకేతుకి యుద్ధవిద్యలలో గొప్ప ప్రావీణ్యత లభించింది. అతడికి తానొక మహాబలశాలిని అనే గర్వం ఉండేది. అతడికి అన్నీ దుర్వ్యసనాలు ఉండేవి. రెండవవాడైన గుణకేతుకి యుద్ధవిద్యల మీద అంతగా మక్కువ లేదు. ఆ కారణంగా అతడు వాటిని అశ్రద్ధ చేశాడు. అయితే చదువుపట్ల ఎక్కువ శ్రద్ధ ఉండటంతో సకల శాస్త్రాలు చదివి మహాపండితుడన్న పేరు తెచ్చుకున్నాడు.

వీరకేతు కంటె గుణకేతు దుర్బలుడు అన్న అభిప్రాయం మహారాజు మనసులో నిలిచి పోయింది. తనకి ఉత్తరాధికారిగా తన కుమారులిద్దరిలో ఎవరికి పట్టాభిషేకం చేయాలా అన్నది ఆయనకొక సమస్యగా మారింది. ఒకరోజు రాజగురువు జ్ఞానేంద్ర స్వామిని పిలిచి, "స్వామీ, నా ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణిస్తూ ఉంది. నా ఇద్దరి కుమారులలో ఎవరికి పట్టాభిషేకం చేయాలో మీరే నిర్ణయించండి." అన్నాడు ధర్మకేతు.

పెద్దకొడుకు వీరకేతుమీద రాజుకు అభిమానమని జ్ఞానేంద్రస్వామికి తెలుసు. అందుచేత ఎవరిని రాజుని చెయ్యాలన్నది ఆయన నోటితోనే చెప్పించా లనుకుని, "ప్రభూ! మనం నిర్ణయం తీసుకొనే ముందు అన్ని మంచిచెడ్డలూ కూలంకషంగా ఆలోచించాలి కదా? ముందుగా మీకొక చిన్న కథ వినిపిస్తాను. మన సమస్యకి ఈ కథ పరిష్కారం మార్గం చూపవచ్చని నా అభిప్రాయం" అని ఇలా ఒక కథ చెప్పారు.

నిత్యజల అనే తటాకంలో ఒక పెద్ద మండూక రాజ్యం ఉండేది. అక్కడ తమకి పూర్తి రక్షణ ఉంటుందనీ, ఆ రాజ్యాన్ని ఏలే ధర్మబుద్ధి మహాబుద్ధిశాలి కాబట్టి ఆ రాజ్యంలో తమకి ఎలాంటి ముప్పు రాదని ఆ మండూకరాజ్యంలోని కప్పలన్నీ గాఢంగా విశ్వసించేవి.

కొంతకాలానికి ధర్మబుద్ధి వృద్ధుడైపోయాడు. ఆ రాజ్యానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చి, వాళ్లు ఎప్పుడైనా ఎవరినైనా తన స్థానంలో రాజుని చేయవచ్చునని ధర్మబుద్ధి ఆ కప్పలన్నింటికి ఎప్పుడో చెప్పాడు.

రాజు తమకి ఇచ్చిన ఆ స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకొని, తమ రాజునే తొలగించాలని ఆ కప్పలు ఆలోచించాయి.

ఒకరోజున అవి తటాకం బయట విశాలమైన ఒక వటవృక్షం కింద సమావేశం అయ్యాయి. కొత్తరాజుగా ఎవరికి పట్టం కట్టాలా అని ఆలోచించసాగాయి. ఆ మధ్యనే ఆ కొలనులోకి చేరిన ఒక కొత్త కప్ప లేచి, "నా సలహా చెప్పమంటారా?" అని అడిగింది.

సరియైన ఆలోచన రాక సతమతమవుతూ ఉన్న ఆ కప్పలు అసహనంగా ఉన్నాయి.

"అదేదో త్వరగా చెప్పు. మాకు ఆకలి అవుతున్నది. వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకొని మేము తటాకంలోకి వెళ్లి భోంచెయ్యాలి" అంది ఒకకప్ప మరింత అసహనంగా.

"మరీ అంత అసహనం తగదు. ఇప్పుడు భోజనానికేం తొందర? మనం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంటున్నాం. ఈ నిర్ణయం పైనే మన మనుగడ ఆధారపడి ఉంటుంది" అంది ఒక ముసలి కప్ప.

"మన రాజుకి లాగే ఈ తాతయ్యకి కూడా వయసైపోయింది. కుర్రాళ్లకి, యువకులకి ఉన్న ఆకలి ఈ ముసలాళ్లకి ఏముంటుంది?" అంటూ ఆ ముసలి కప్పని గౌరవించకుండా ఎద్దేవా చేసిందా కుర్రకప్ప.

"ముసలాళ్లు నోరు మూసుకుని ఉండండి" అని మరో కుర్రకప్ప అధికారం చెలాయించింది.

"రాజుకి బలం ముఖ్యం. కొంగ మనలాగే ఉభయచరం మాత్రమే కాక అది మనకంటె మహాబలశాలి. కొంగ మనకి రాజైతే రాజ్యం సుభిక్షంగా ఉంటుంది" అంది కుర్రకప్ప.

"ఈ సలహా బేషుగ్గా ఉంది. కొంగనే మన రాజుని చేద్దాం" అంది మరో కుర్రకప్ప.

"ఈ సలహా మనందరికీ ప్రాణాంతకంగా మారగలదు. కొంగ మనకి శత్రువు. అది మనకి రాజు ఏంటి? తస్మాత్ జాగ్రత్త!" అంది ముసలి కప్ప కంగారుగా.

"నువ్వు నోరు మూసుకొని ఉండ్రా ముసలీ! ఇప్పుడు నీ వయసైపోయింది. ఇక మాకు సలహాలు ఇవ్వతగవు. నరాలు కుళ్లిన, వయస్సు మళ్లిన నీ ఆలోచన్లూ ముసలివైపోయాయి" అంది మరో కుర్రకప్ప అదే విధంగా అధికారం చెలాయిస్తూ.

మిగతా కప్పలు ఏమీ నిర్ణయించుకోలేకపోతున్నాయి. బుల్లి కప్పలే పెద్ద విషయంలో బుల్లి నిర్ణయం తీసుకున్నాయి. అతి చొరవగా. అందుకే అతి చొరవ చూపేవాళ్లకి బాగా దూరంగా ఉండాలంటారు విజ్ఞులు.

ఆ అల్ప మండూకాల తెలివితక్కువ నిర్ణయం ఫలితంగా ఒక కొంగ ఆ నిత్యజల తటాకంలోని ఆ మండూక రాజ్యానికి రాజు అయింది. రోజుకో కప్పని చొప్పున ఆ కప్పలన్నింటినీ అది గుటకాయస్వాహా చేసింది. చివరగా దానికి పట్టం కట్టిన ఆ రెండు బుల్లి కప్పలు మిగిలాయి.

"నిన్ను రాజుని చేసినవాళ్లం మేమే. మమ్మల్ని వదిలెయ్యి" అన్నాయి ఆ రెండు బుల్లి కప్పలు.

"నన్ను రాజుని చేసిన నేరానికి మరి మీకు శిక్ష పడద్దూ? ఈ రాజ్యానికి రాజును నేను మీకు మరణశిక్ష విధిస్తూ, వెంటనే అమలు చేస్తున్నాను" అని ఆ కొంగరాజు చివరికి మిగిలిన ఆ రెండు బుల్లి కప్పల్ని కూడా తినేసింది.

రాజగురువు జ్ఞానేంద్రస్వామి కథ పూర్తి చేసి, "ప్రభూ! రాజుకి కావలసింది బలమా? గుణమా? అన్న సమస్యకి ఈ కథ పరిష్కార మార్గం చూపుతున్నది. రాజుకి పరాక్రమం అవసరమే. అయితే అంతకంటె ముఖ్యమైనది సద్గుణసంపద. ఇక నిర్ణయం మీరే తీసుకోవచ్చు" అన్నారు.

రాజగురువు చాలా సున్నితంగా వీరకేతు దుష్టస్వభావాన్ని బలిశాలియైన కొంగతోనూ, గుణకేతు సాత్విక స్వభావాన్ని మహాబుద్ధిశాలి అయిన కప్పలరాజు ధర్మబుద్ధితోనూ పోల్చి తనకి జ్ఞానోదయం కలిగించారని మహారాజు గ్రహించాడు. ఆ తరువాత నిశ్చింతగా ఆయన తన చిన్న కొడుకు గుణకేతుని రాజుగా పట్టాభిషేకం చేశాడు.

సుంకర భాస్కరరావు